ఉగాది సందర్భంగా రవీంద్రభారతి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఘనంగా ఉగాది సంబరం

**ఆకట్టుకున్న నృత్య విన్యాసం**

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాచంపల్లి సంతోష్‌కుమార్ పంచాంగ శ్రవణంచేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్న తాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అలాగే నగరంలో పలు దేవాలయాల్లో, కమ్యూనిటీ హాళ్లల్లో వేదపండి తులు పంచాంగ శ్రవణం చేశారు.

# కోకాపేట శారదాపీఠంలో వైభవంగా ఉగాది వేడుకలు

**హాజరైన మాజీ గవర్నర్, హైకోర్టు న్యాయమూర్తులు**

**నార్సింగి, మార్చి 19 ప్రభాతవార్త :**

గండిపేట మండలం కోకాపేటలోని శ్రీశారదా పీఠంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. శారదా చంద్ర మౌళీశ్వర ఆరాధనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో చిత్రాపూరి విజయనాథ్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతీ మాట్లాడుతూ దేశ క్షేమం కోసం నిత్యం శారదా పీఠంలో కైంకర్యాలు, ఆధ్యాత్మిక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, తెలుగు ప్రజలు అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తున్నట్లు వివరించారు. హైందవ ధర్మంలో ఆచరించే ప్రతీ క్రతువు, పూజ, ఆచార, వ్యవహారాల వల్ల ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం పెరుగుతాయన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని వందలాది మంది భక్తజనులకు, వివిఐపిలకు పంపిణీ చేశారు. ఈ వేడుకలు భక్తులలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని పెంచుతాయని తెలిపారు. ఈ వేడుకల్లో హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ రామకృష్ణారెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎన్‌సిఎల్‌టి న్యాయ సభ్యుడు సబ్జీస్ బద్రినాథ్, మాజీ న్యాయమూర్తి వెంకటరమణ, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌రావ్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, మాజీ డీజీపి అంజన్‌కుమార్, ఎపి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రుద్రరాజు, ప్రసిద్ధ గజల్ గాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు న్యాయమూర్తులు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

# ఆస్తి పన్ను బకాయిదారులపై ప్రత్యేక డ్రైవ్

**ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

మార్చి 31 వరకు అవకాశం కల్పించిన వన్ టైమ్ స్కీమ్ (ఓటీఎస్) పథకం ద్వారా ఆస్తి పన్ను చెల్లించి పెనాల్టీ నుంచి ఉపశమనం పొందవచ్చని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.ఎంఎంసి పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారుల నుండి పన్ను వసూలు చేయడానికి రెవెన్యూ విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఎంఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో ప్రతి సర్కిల్ నుండి ఇద్దరు ఉద్యోగులను ఎక్కువ బకాయిలు ఉన్న 100 ఆస్తి పన్ను బకాయిదారులను గుర్తించి వారికి ఫోన్ చేసి ఆస్తి పన్ను బకాయిలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఆస్తి పన్ను వడ్డీపైన 90 శాతం రాయితీ మార్చి 31 వరకు మాత్రమే ఉంది అని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మార్చి 31 తర్వాత కూడా ఆస్తి పన్ను వసూలు డ్రైవ్ ఉంటుందని, కానీ అప్పుడు వడ్డీపై రాయితీ ఉండదన్నారు. గడువు ముగిసిన తర్వాత ఆస్తి పన్ను వడ్డీతో సహా కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించడానికి పౌరులు కూడా సానుకూలంగా స్పందిస్తూ కొందరు వెంటనే కడతామని, మరికొందరు ఒక వారంలోపు కడతామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. ఆస్తి పన్ను వెబ్ సైట్ ద్వారా గాని మై క్యూర్ యాప్‌లో గానీ లేదా దగ్గరలోని మీసేవ,పౌర సేవా కేంద్రంలో చెల్లించవచ్చని తెలిపారు.

# పాతబస్తీలో ట్రాఫిక్ మళ్లింపు

**చార్మినార్, మార్చి 19 ప్రభాతవార్త :** రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం ప్రార్థనలు సందర్భంగా ఈ నెల 20వ తేదీన చారిత్రక మక్కామసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలలో జరగనున్న ప్రార్థనలు దృష్ట్యా ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించటం జరిగిందని పోలీసులు వెల్లడించారు. నయాపూల్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను మదీనా జంక్షన్ వద్ద సిటీ కళాశాల వైపు మళ్లిస్తారు. శాలిబండ, నాలుగు చింత నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను హిమ్మత్‌పుర జంక్షన్ వద్ద హరిబౌలి, ఓల్గా హోటల్ ఖిల్వత్ వైపు మళ్లిస్తారు. చౌక్ మైదాన్ నుంచి వచ్చే వాహనాలను కోట్లా అలీజా లేదా మొఘల్‌పుర వైపు,మూసాబౌలి నుంచి వచ్చే వాహనాలను మోతీగల్లీ వద్ద,రాజేష్ మెడికల్ శాలిబండ, ఫతేదర్వాజ రోడ్డు వైపు మళ్లిస్తారు. గుల్జారాహౌస్ వైపు వచ్చే వాహనాలను ఏతెబార్ వద్ద నుండి మీరాలం మార్కెట్ లేదా బిబి బజార్ వైపు, మిట్టికాషేర్ నుంచి గుల్జారాహౌస్ వైపువచ్చే వాహనాలను ఘాన్సీ బజార్ మీదుగా హైకోర్టు రహదారి,కిల్వత్ వైపు మళ్లించనున్నారు.లక్కడ్ కోట (పాత సీపీ ఆఫీస్ జంక్షన్) అవసరాన్ని బట్టి ఏపిటిఏ నుంచి వచ్చే వాహనాలను మండి మీరాలం మార్కెట్ వైపు మళ్లిస్తారు. ఈ ఆంక్షలు ఆర్‌టిసి బస్సులకు కూడా వర్తిస్తాయి.సిటీ బస్సులు అఫ్జల్‌గంజ్ వద్ద నిలిపి వేయనున్నారు.జిల్లా బస్సులు చాదర్‌ఘాట్, సైదాబాద్, మిదానీ ప్రాంతీలు మీదుగా మళ్లించ బడతాయి. కాగా పాతబస్తీలోని గుల్జార్ ఫంక్షన్ హాల్, ముఫీద్ ఉల్ అనామ్ గ్రౌండ్, చార్మినార్ బస్ టెర్మినల్, ఏయుహాస్పటిల్ పార్కింగ్, ఖిల్వత్ గ్రౌండ్, పాత పెన్షన్ కార్యాలయం ప్రాంతాలలో వాహనాలను పార్కింగ్ చేయటానికి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరగనున్న జుమాతుల్ విదా ప్రార్థనలు సందర్భంగా చార్మినార్ జోన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.మక్కామసీదులో శుక్రవారం మధ్యాహ్నం మక్కామసీదు ఖతీబ్ అల్‌హాజ్ మహ్మద్ రిజ్వాన్‌ఖురేషీ ప్రార్థనలు చేయిస్తారని మేనేజర్ తెలిపారు.

## కెటిఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్

**సికింద్రాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండి డివిజన్ మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామలహేమ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావు గౌడ్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఉగాది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పర్వదినమని పేర్కొన్నారు. ఈ కొత్త సంవత్సరం అందరికీ సుఖ శాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షి చారు.

# హోటల్ బిల్లుల్లో 'గ్యాస్ ఛార్జీ'..!

- వినియోగదారుల అసహనం!
- ముందస్తు సమాచారం లేకుండానే అదనపు ఛార్జీలు
- బిల్లుకు రూ. 20 నుంచి రూ. 30 వరకు భారం

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో టిఫిన్ చేసినా, భోజనం చేసినా బిల్లు చూసి కస్టమర్లు బెంబేలెత్తిపోతున్నారు.ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతుంటే, తాజాగా 'గ్యాస్‌ఛార్జీ' పేరుతో అదనపు వడ్డన మొదలైంది. ఒక్కో బిల్లుపై రూ. 20 నుంచి రూ. 30 వరకు అదనంగా వసూలు చేయడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. నగరంలోని అమీర్‌పేట, బంజారాహిల్స్, చిక్కడపల్లి, కాచిగూడ, బోడుప్పల్ వంటి ప్రాంతాల్లోని చిన్న, మధ్యతరహా హోటళ్లలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. మెనూ కార్డులో ధరలు యథాతథంగానే ఉంచి, బిల్లు చివరలో గ్యాస్ ఛార్జీ అని కొత్త కాలమ్‌ను చేరుస్తున్నారు. ఆర్డర్ ఇచ్చే సమయంలో ఈ విషయం చెప్పకపోవడంతో, బిల్లు చేతికి వచ్చాక కస్టమర్లు హోటల్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు. వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని హోటల్ యజమానులు చెబుతున్నారు. "మెనూ ధరలు పెంచితే కస్టమర్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది, అందుకే తాత్కాలికంగా ఈ సర్ ఛార్జీని విధిస్తున్నాం" అని అమీర్‌పేటలోని ఒక రెస్టారెంట్ మేనేజర్ పేర్కొన్నారు. చాలా హోటళ్లలో మెనూ కార్డులో ఉన్న ధరలకే ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు కనిపిస్తున్నా, చివరకు బిల్లు ఇచ్చే సమయంలో మాత్రం అదనంగా రూ. 20 నుంచి రూ. 30 వరకు 'గ్యాస్ ఛార్జీ' అని వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు.. రూ. 79 విలువైన దోశ తింటే,దానికి అదనంగా రూ. 30 గ్యాస్‌ఛార్జీ కలిపి మొత్తం రూ.109 వసూలు చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఆర్డర్ ఇచ్చే సమయంలో ఈ విషయం చెప్పక పోవడంతో కస్టమర్లు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు.. ధరల భారం తగ్గించుకోవడానికి కొన్ని హోటళ్లు ఆహార పదార్థాల పరిమాణాన్ని తగ్గిస్తున్నాయి. గ్యాస్ ఖర్చును తగ్గించుకోవడానికి ఇండక్షన్ స్టౌవ్‌ల వినియోగంపై యాజమాన్యాలు దృష్టి సారిస్తున్నాయి. ఏదైనా అదనపు ఛార్జీ ఉంటే ముందే స్పష్టంగా చెప్పాలని లేదా మెనూ ధరల్లోనే చేర్చాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. హోటళ్లు ఏ రకమైన అదనపు ఛార్జీలు వసూలు చేసినా, అది వినియోగదారుడికి ముందే తెలిసి ఉండాలి.ప్రభుత్వం లేదా పౌరసరఫరాల శాఖ ఇలాంటి అడ్డగోలు వసూళ్లపై దృష్టి సారించి, వినియోగదారులకు రక్షణ కల్పించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఏదిఏమైనా, సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్న ఈ గ్యాస్ సెగపై పౌర సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు స్పందించి ఈ అదనపు ఛార్జీలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

# హైదరాబాద్ వార్త



# కల్తీలతో నీరసమే

- కాలం చెల్లిన పదార్థాలు.. అస్తవ్యస్తంగా పరిస్థితులు
- బూజుపట్టిన పచ్చళ్లు.. కుళ్లిన చికెన్, కల్తీ పన్నీరు. .
- డ్రమ్ములకొద్ది అల్లం వెల్లుల్లి
- పాతబస్తీ అయినా.. ఐటీ కారిడార్ అయినా ఒక్కటే
- పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**

బయట ఏదైనా తినాలంటేనే కాదు.. తాగాలన్నా జడుసుకోవాల్సిన దుస్థితి నగరంలో నెలకొంది. కల్తీ పాలు, నూనె, అల్లం వెల్లుల్లి, పసుపు, కారం, చాయపత్త, పన్నీరు, చికెన్ ఇలా పలు రకాల ఆహార పదార్థాలను పలు రకాల రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహార పదార్థాలను తయారుచేసి సొమ్ము చేసుకుంటున్నారు.ఈజీగా మనీ సంపాదించుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ విభాగం కొంతకాలంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో స్టార్ హోటళ్ల నుంచి చిరుతిళ్ల దుకాణాల దాకా, బిర్యానీ సెంటర్ల నుంచి హోమ్‌ఫుడ్స్ దాకా, చికెన్ సెంటర్ల నుంచి స్వీట్ దుకాణాల దాకా..ఇలా అంతటా అధ్వాన్నపు పరిస్థితులే దర్శనమివ్వడం తెలిసిందే.

వేసవి ఎండలు ముదరడంతో ప్రజలు కూల్ డ్రింక్స్, జూస్ సెంటర్లను ఆశ్రయించడం తెలిసిందే. చల్లగా వాటిని తాగి ఉపశమనం పొందాలనుకునేవారు జడుసుకోవాల్సిన పరిస్థితి కనిపించాయి. తాజాగా గచ్చిబౌలిలో జూస్ సెంటర్లలో నిర్వహించిన తనిఖీల్లోనూ అవే దృశ్యాలు కనిపించాయి. అంతటా దర్శనమిచ్చినట్లే ముసురుకున్న ఈగలు, తిరుగుతున్న బొద్దింకలు ఒకచోట ఎలుకలు కనిపించాయి. ఫుడ్‌సేఫ్టీ ఆధారిటీ నుంచి లైసెన్సులు లేకపోవడం, సిబ్బందికి అప్రాన్లు, గ్లవ్స్, తలకు క్యాప్స్ లేకపోవడం చాలా చోట్లా మాదిరే అక్కడా లేవు. యాపిల్, నల్లద్రాక్ష, సపోటా, మామిడి, నారింజ, బతాయి తదితర పండ్లు చెడిపోయినవి కనిపించాయి. స్ట్రాబెర్రీ ఫ్లేవర్ సిరప్, ప్యాషన్ ఫ్రూట్ సిరప్ తదితరాలు గడువు ముగిసిన తేదీలనే ఉన్నాయి.

సికింద్రాబాద్, మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేల కిలోల్లో కల్తీ పన్నీరు బయటపడడంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీరును సీజ్ చేశారు ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. శ్రీబాలాజీ డైరీ ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపుతో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీబాలాజీ డైరీ ప్రొడక్ట్స్‌లో 1600 కిలోల పన్నీరును సీజ్ చేశారు. విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాపులో 1000 కిలోల కల్తీ పన్నీరు సీజ్‌చేశారు. నిర్వాహకులు నగరంలో పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరు అమ్ముతున్నట్లు గుర్తించారు.

ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ కుల్‌సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్తీ పచ్చళ్లను తయారు చేస్తున్న గోదాంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రసాయనాల కోసం వినియోగించే ప్లాస్టిక్ డ్రమ్ములో బూజుపట్టి ఉన్న 72 డ్రమ్ముల పచ్చళ్ల నిల్వలు, ఆరు డ్రమ్ముల టమాట, ఒక డ్రమ్ము అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కుల్సుంపురా పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులుగానీ, ఫుడ్‌సేఫ్టీ విభాగం నుంచి లైసెన్స్ గానీ లేకుండా అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో పచ్చళ్ల తయారీ, నిల్వలు చేస్తున్నట్లు గుర్తించారు.నిందితులు కుళ్లిపోయిన కూరగాయలు, నాణ్యతలేని మసాలాలు, కారంపొడి, నూనెలు, ఇతర ముడిపదార్థాలను ఉపయోగిస్తూ నాణ్యతలేని పచ్చళ్లను తయారు చేస్తున్నట్లు తేలింది. స్థానిక దుకాణాలకు తక్కువ ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు నిందితుల విచారణలో స్పష్టమైంది.

ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ, నిల్వ ఉంచిన కుళ్లిన చికెన్‌ను విక్రయిస్తున్న ముషీరాబాద్‌లోని ఒక చికెన్ సెంటర్‌పై ఇటీవల వారిసి గూడ పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాపూజీనగర్‌లోని ఏ1 ఫ్రెష్ చికెన్‌మార్ట్ యజమాని అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన ఫ్రోజన్ చికెన్‌ను స్థానిక ప్రజలకు, వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో చికెన్ సెంటర్‌పై ఆకస్మిక దాడి నిర్వహించి 610 కిలోల చికెన్ అత్యంత అపరిశుభ్రమైన స్థితిలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నిల్వ ఉంచిన మాంసం పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రదేశంలో ఎలుకలు, పిల్లుల సంచారం ఉండటంతో మాంసం పూర్తిగా కలుషితమైంది. సదరు చికెన్ షాపు ట్రేడింగ్ లైసెన్స్ ఏడాది క్రితమే ముగిసినట్లు తేలింది. మానవ వినియోగానికి పనికిరాని ఈ కుళ్లిన మాంసాన్ని నిందితుడు తెలిసి కూడా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అల్లం

**నిబంధనలు అలా ఉన్నాయి...**

తనిఖీల సందర్భంగా పలు లోపాలు వెల్లడైనా, ప్రజల ఆరోగ్య రక్షణ లేకపోయినా, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు లేకపోవడంతో ఇందుకు కారణమని జిహెచ్‌ఎంసి వర్గాలు చెబుతున్నాయి. దానికి తోడు ల్యాబ్ పరీక్షల ఫలితాలు రావడానికి ఎంతో సమయం పడుతోంది. ప్రస్తుతం శాంపిల్స్ పరీక్షలకు ఒకే ఒక్క ల్యాబ్ ఉంది. అది కేవలం నగరానికేకాక రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్యాంపిల్స్ అక్కడికే వస్తాయి. ఈ నేపథ్యంలో నగరంలోని జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసి మున్సిపల్ కార్పొరేషన్లకు రెండు చొప్పున ఆరు ల్యాబ్‌లు ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. చర్యలు వేగిరం తీసుకునేందుకు అవసరమైతే నిబంధనలు మార్చాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పన్నీరు

చెట్నీ

# ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి కృష్ణ**

మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** రాజ్యాంగానికి విరుద్ధంగా, 2011 జనాభా లెక్కలు ఆధారంగా ఏకసభ్య కమిషన్ ద్వారా ప్రభుత్వం చేసిన ఎస్సీ వర్గీకరణ మాలలకు విద్యను శాశ్వతంగా దక్కనీయకుండా ప్రభుత్వం దారుణంగా ద్రోహం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మాలలకు జరిగిన అన్యాయాలపై చర్చించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 300 స్థానాలకు మాలలును నిలబెట్ట కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు అధిక జనాభా ఉన్నందున వర్గీకరణలో 2వ గ్రూపులో మాలలు చేర్చుతూ 9 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ, రోస్టర్ పాయింట్లు 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97లను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వినయ్‌కుమార్, అరుణ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

# అమ్మ దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

**బేగంపేట, మార్చి 19 ప్రభాతవార్త :**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహ కాళీ అమ్మ వారి దేవాలయానికి ఉగాది పర్వదినం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.శ్రీ పరాభవ నామ సంవత్సరం అమ్మ వారు తమ కుటుంబాల్లో నూతన వెలుగులు నింపాలని భక్తులు అమ్మ వారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మ వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడి పంపిణీ చేసారు. ఉగాది రోజున అమ్మ వారి ఆలయం భక్తులతో కిటకిట లాడింది.అమ్మవారి ఆలయంతో పాటు అద్దాల మండపాన్ని వివిధ రకాలైన పూలతో సుందరంగా అలంకరించారు.

**రూ. 5 కోట్లు ఇస్తామని..**

# రూ. 15 లక్షలు కాజేశారు

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త**

రూ. 5 కోట్ల ఆర్థిక సాయం అందిస్తామని నమ్మించి రూ. 15 లక్షలు కాజేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మొహమ్మద్ ఆసిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సూరజ్ తివారి అనే వ్యక్తి ఆసిఫ్‌ను సంప్రదించి అతని సంస్థకు ఆర్థిక సహాయం అందిస్తామని నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆయన ప్రతినిధులు ముంబైకి వెళ్లగా, అక్కడ నిందితులు మరి కొందరితో కలిసి హైదరాబాద్‌కు రావాలని సూచించారు. తర్వాత హైదరాబాద్‌లో సమావేశమైన నిందితులు రూ. 5 కోట్ల సహాయం అందిస్తామని చెప్పి ముందుగా రూ. 15 లక్షలు డొనేషన్‌గా ఇవ్వాలని కోరారు. వారి మాటలను నమ్మిన ఆసిఫ్, ముకేష్ ట్రేడర్స్ పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా రూ. 15 లక్షలు బదిలీ చేశాడు. డబ్బులు తీసుకున్న తర్వాత నిందితులు రూ. 5 కోట్లు ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీంతో తమను మోసగిస్తున్నారని గ్రహించి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని..స్కూటరిస్టు మృతి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**

అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. వేగంగా వచ్చిన బస్సు వెనుకనుంచి స్కూటర్‌ను ఢీకొట్టడంతో స్కూటరిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలోని మోహదీపట్నంలో గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..మెహదీపట్నం డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టింది. బస్సు ముందు వెళ్తున్న స్కూటర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టడంతో స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తి కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో స్పాట్‌లోనే చనిపోయారు. మొయినాబాద్ తాజ్ హోటల్ సమీపంలో బీజాపూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్కూటరిస్టు



పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితుడు బ్రహ్మశ్రీ ఆనంతాచార్యులు

## ఘనంగా పంచాంగ శ్రవణం

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :** నల్లకుంట పాతరామలయంలో శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలను పురస్కరించుకొని ఆలయ ప్రధాన పూజారి, వేదపండితుడు బ్రహ్మశ్రీ కె.ఆనంతాచార్యులు ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన పంచాంగ శ్రవణం చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ ధర్మకర్త జి.కార్తిక్‌బాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని పంచాంగ శ్రవణం ఆలకించారు. ఈ సందర్భంగా అనంతాచార్యులు మాట్లాడుతూ ఆలయంలో కొలువుతీరిన శ్రీసీతారామచంద్రస్వాములకు శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈనెల 25న ధ్వజారోహణం, గరుడ పూజ, 26న మంగళస్నానం, ఎదుర్కోలు, 27న ఉదయం 6గంటలకు అభిషేకం, 9 గంటలకు మహాపూర్ణాహుతి, ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం స్వామివారికి రథోత్సవం, 28న సాయంత్రం పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దవత్తున బ్రహ్మోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## టిపిసిసి కార్యదర్శిగా ధన్‌రాజ్‌మాదిగ

**గన్‌ఫౌండ్రి, మార్చి 19 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి కార్యదర్శిగా మాజీ సెప్టిన్ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్. ధన్‌రాజ్‌మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఎస్.ధన్‌రాజ్‌మాదిగను నూతన కార్యదర్శిగా నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ధన్‌రాజ్‌మాదిగ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించినందుకు ప్రదేశ్ కమిటి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్నకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకువెళ్లి మహానగరంలో రాబోయే ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీని తనవంతుగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి
### ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మార్చి 19 ప్రభాతవార్త:** ప్రజలు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బొమ్మల రామారం,చీకటి మామిడిలో ప్రసిద్ధిగాంచిన తిరుమలనాథ స్వామి దేవాలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆలయ పాలక మండలి సభ్యులు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేసి వేద పండితులచే ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పౌండర్ చైర్మన్ మచ్చ శ్రీదేవీ,చంద్రమౌళి గౌడ్, బలరామ్, సర్పంచ్ నాగరాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఉగాది వేడుకల్లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

## బిజెపి కార్యాలయంలో ఉగాది వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 19, ప్రభాతవార్త :** కొత్త ఆశలను వెంటబెట్టుకొని వస్తున్న శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురువారం కూకట్ పల్లిలోని ఆయన కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు స్వయంగా ఉగాది పచ్చడిని అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ కొత్త ఆరంభా లకు, కొత్త ఆశయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఉగాది పచ్చడి లోని ఆరు రుచులు మన జీవితంలోని సుఖదుఃఖాలను సూచిస్తాయని, ప్రతి పరిస్థితినీ సమానంగా స్వీకరించాలి అనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నిండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. కార్యకర్తలు ప్రజాసేవ లో నిబద్ధతతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉత్సాహంగా ఉగాది వేడుకలను నిర్వహించారు.

## ఉగాది పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, మార్చి 19 (ప్రభాతవార్త) :** వంశీ ఆర్ట్ థియేటర్స్ స్వర్ణోత్సవాల సందర్భంగా శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని 12 దేశాలకు చెందిన 65 మంది ప్రతిభామూర్తులకు 54వ వంశీసీల్‌వెల్ ఉగాది పురస్కారాలనుఖి అందజేయనున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత , కళా బ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, బండారు సుబ్బారావు, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ వివరించారు. సీల్‌వెల్ కార్పొరేషన్ సౌజన్యంతో, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, శ్రీ సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో 22న చిక్కడపల్లి త్యాగరాయగానసభలో పూర్వ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,హాజరై పురస్కారాలను ప్రధానం చేస్తారు. జ్యోతి ప్రజ్వలన సినీ నటుడు డా. రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ నటుడు, దర్శకుడు తనికెళ్ళ భరణి గ్రంథావిష్కరణ చేస్తారు. నిమ్స్ డైరెక్టర్ డా. ఎన్.భీరప్ప, కిమ్స్ వ్యవస్థాపకులు బొల్లినేని కృష్ణయ్య తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. సినిమా రంగం నుండి నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్‌కు నటశిఖరం బిరుదు, సీనియర్ నటి సంగీతకు నటనా శిరోమణి, మంజుభార్గవికి నృత్యకళా శిరోమణి బిరుదులతో పురస్కారాలు అందజేస్తారు. ఋగ్వేద పండితులు సందుగుల రాఘవాచార్య స్వామి, డా. బాచంపల్లి సంతోష్ కుమార్ లకు వంశీసీల్‌వెల్ పురస్కారాలు, వైద్య రంగంలో డా. ఎన్. భీరప్ప, పత్రికా రంగంలో సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, సాహిత్య రంగంలో ఆచార్య సూర్య ధనుంజయ్ తదితరులు పురస్కారాలు అందుకోనున్నారు. అంతేకాకుండా, ఉదయం నుండి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాదస్వరం, దివ్యాంగ కళాకారుల ప్రదర్శనలు, కవి సమ్మేళనం, సంగీత కచేరీలు నిర్వహించబడతాయి. డా. బాచంపల్లి సంతోష్ కుమార్ చే పంచాంగ పఠనం ఉంటుంది. ఈ వేడుకను విజయవంతం చేయవలసిందిగా వంశీ సంస్థల వ్యవస్థాపకులు డా. వంశీ రామరాజు కోరారు.

పంచాంగ శ్రవణంను వింటున్న మాజీమేయర్ మహేందర్‌గౌడ్, తదితరులు

జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం(పాతచిత్రం)

## ఏప్రిల్ 5న జూబ్లీహిల్స్ సొసైటీ ఎన్నికలు

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త :** ఎంతో ప్రతిష్టాత్మకమైన జూబ్లీ హిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ(జేహెచ్‌సీహెచ్‌బీఎస్) ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఎప్రిల్ 5న సొసైటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నదమవుతున్నారు. కొద్ది నెలలుగా సొసైటీ ఎన్నికలను అడ్డుకొనేందుకు పలు ప్రయత్నాలు జరిగాయని, న్యాయపరమైన అడ్డంకులు, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు సొసైటీలో వినిపించాయి. దీనికితోడు ఎన్నికల కాలపరిమితి ముగిసేలా చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని భావించినట్లు కొందరు బాహాటంగానే విమర్శించారు. అయితే తాజాగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతోపాటు ఎన్నికల తేదిని నిర్ణయంతో ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లైంది. దీనికితోడు తొలిసారిగా 4039 మంది ఓట్లు నమోదు చేసుకొని ఆమోదం పొందగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 800ల ఓట్లు రద్దయ్యాయి. మరో 270 ఓట్లు ఎలాంటి మార్పులు లేకుండా అలానే ఉన్నాయని సొసైటీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రస్తుత సొసైటీ అధ్యక్షుడు బి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. సొసైటీ చరిత్రలోనే ఇది ఒక సరికొత్త అధ్యాయం అన్నారు. 4039 రిజిస్టర్ ఓటర్లుగా నమోదై ఆమోదం పొందడం సాధారణ విషయం కాదని అన్నారు. ఇది సంఖ్య కాదని, సభ్యుల గొంతుక తెలియజేయడానికి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో సభ్యులు నిజాయితీ వైపు నిలబడాలని, సొసైటీని కాపాడుకోవాలని ఆయన కోరారు.

## ఉగాది వేడుకల్లో పాల్గొన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

ఉగాది వేడుకల్లో పాల్గొన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త :** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పరాభావ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాగ శ్రవణం విన్నారు. ఆయనతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ కిట్లు అందజేత

**కోట్‌పల్లి, మార్చి 19, ప్రభాతవార్తన:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మైనార్టీ సోదరులకు సోదరీమణులకు ఇఫ్తార్ కిట్టు ఉచితంగా కరీంపూర్ సమీపంలో ఉన్న మైటీ కన్వెన్షన్ హాల్లో పేద మైనార్టీలకు 250, కిట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారవేత పెద్దాపు నాయుడు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కరీంపూర్ మాజీ సర్పంచ్ సుందరి అనిల్ మరియు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంపూర్ సర్పంచ్ సాధాత్‌పటేల్, జిన్నారం సర్పంచ్ హుస్సేన్ ఎన్కెపల్లి సర్పంచ్ రవికుమార్ ఉప సర్పంచ్ మైబూబ్. అనిల్, నర్సింలు, యేసు, యాత్ అధ్యక్షులు కొండల్ రెడ్డి. బిసి సెల్ అధ్యక్షులు గొడ్డలి మల్లయ్య, మైనార్టీ అధ్యక్షులు హాజీ మస్తాన్, యువ నాయకులు అరుణ్. శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు యాకుబ్ మైనోదిన్, నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ శ్రేణులు

## ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన బిఆర్ఎస్ శ్రేణులు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 19, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరాలకు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గురువారం ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పండుగ సందర్భంగా వారి క్యాంప్ కార్యాలయంలో కలిసి, తెలుగు నూతన సంవత్సర (ఉగాది) శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షులు బొట్టు విష్ణు, కూకట్‌పల్లి రామాల యం మాజీ చైర్మన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇన్ శ్రీనివాస రావు(తులసిరావు) మర్యాద అశోక్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

## మహిళా జర్నలిస్టులకు సత్కారం

మహిళా జర్నలిస్టులు, ప్రముఖులకు సత్కరించిన దృశ్యం

**రవీంద్రభారతి, మార్చి 19 (ప్రభాతవార్త) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీఆకాంక్ష చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన మహిళలకు, మహిళా జర్నలిస్టులకు సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పోలేటి పార్వతీశం మాట్లాడుతూ అంతరిక్షంలో ఏడాదికిపైగా గడిపిన సునీతావిలియమ్స్ మహిళల ఆత్మస్థైర్యానికి నిదర్శనమని చెప్పారు. డాక్టర్ కె.వి. రమణ మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి గౌరవించినప్పుడు, ఆ సత్కారం పొందిన వారికి ఆత్మసంతృప్తి కలుగుతుందని వివరించారు. యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, పాలపర్తి సంధ్య తండ్రి ఆకాంక్ష మేరకు ఈ సంస్థను స్థాపించి ఎనిమిదేళ్లుగా సామాజిక, కళా వికాస కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారని ప్రశంసించారు. మహిళా జర్నలిస్టులు డాక్టర్ సలీమ, డాక్టర్ వాకా మంజుల రెడ్డి, డాక్టర్ వైజయంతి, సుజిత, డాక్టర్ విద్యాభార్గవితో పాటు విద్యావేత్త డాక్టర్ మమత, గాయని పద్మావతి, సేవా కార్యకర్త తులసీ పద్మ తదితరులకు అందించారు.సంస్థ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి నివేదిక సమర్పించగా, మోహన్ కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

మంచిరేవులలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ మేకల ప్రవీణ్‌యాదవ్, నాయకులు లంకల పాపిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు

# భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

సోమలింగేశ్వరస్వామి దేవాలయంలో పంచాంగ పటనం చేస్తున్న పూజారులు

**జిల్లెడు చౌదరిగూడ ,కొందుర్గు,మార్చి 19,(ప్రభాతవార్త):** తెలుగు నూతన సంవత్సరాది పరాభవ నమ సంవత్సరం వేడుకలను కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడ మండలాల్లో ప్రజలు భక్తిశద్ధలతో ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల దేవాలయాలల్లో గురువారం నాడు సుప్రభాత సేవలు, అభిషేకాలు,ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండల కేంద్రంలోని ఉత్తర దశలో గల పెండ్యాల లక్ష్మీ నరసింహస్వామి గుట్ట గుట్టపై గల దేవాలయము తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాల అన్నింటిని పచ్చని తోరణాలతో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే మండల పరిధిలోని పలు దేవాలయాలకు ఉదయం నుండి భక్తులు వచ్చి వారు తెచ్చిన నైవేద్యాలను స్వామివారికి సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం నుండి స్వామివారిని ఊరేగింపుగా గాడి బావి హనుమాన్ దేవాలయం వరకు శోభయాత్ర తీశారు. తిరిగి అక్కడి నుండి ఊరేగింపుగా లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంకు శోభయాత్ర చేరింది. శోభయాత్ర ముందు భక్తులు భజనలు చేస్తూ ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం దేవాలయం ఆవరణలో అర్చకులు జంగం రాజేశ్వర స్వామి, జంగం రవి పంతులు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శుభ యాత్రలో దేవాలయ కమిటీ చైర్మన్ చేవెళ్ల కృష్ణయ్య, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, గ్రామ సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్, ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్, దేవాలయ కమిటీ సభ్యులు అమర్ లింగం, అనిత అశోక్, శీలం వేణుగోపాల్, నరసింహులు, మాధవరెడ్డి, తోపాటు వివిధ పార్టీల నాయకులు కావలి యాదయ్య, రాములు గౌడ్, ఈసారి సత్యనారాయణ, కొమరబండ శ్రీశైలం, పటేలు వీరన్న, కాడి గళ్ల మహేంద్ర నాథ్, గండేటి వేణుగోపాల్, కావలి శరత్, ఎ. మనయ్య తో పాటు గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .



కొందుర్గు మండల కేంద్రంలో పంచాంగ పటనం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం

**శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది పండుగను ప్రజలు ఘనంగా

శామీర్‌పేటలోని శివాలయంలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ప్రధాన పూజారి మురళీధర్‌శర్మ, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తుల దృశ్యం

జరుపుకున్నారు. గురువారం శామీర్‌పేట మండలం( జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్-300)లో, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల్లోని వివిధ గ్రామాల్లో ఉగాది పండుగ సందర్భంగా ఇళ్ల ద్వారాలకు పచ్చతోరణాలు కట్టి, ఇళ్లల్లో తీపివంటలు చేసుకుని తినటం, షడ్రుచులతో పచ్చడి చేసి సేవించారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలకు వెళ్లి ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రజలు పూజలు చేశారు. శామీర్‌పేట మండల కేంద్రంలోని శివాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. శామీర్‌పేటలోని శివాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి జి.మురళీధర్‌శర్మ శ్రీపరాభవ నామసంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది శ్రీపరాభవ నామ సంవత్సరంలో జరిగే వాటిని, పంటలు, పాలన, ఆదాయ, వ్యయాల,భవిషత్ పలు అంశాలకు సంబంధించి పంచాంగం శ్రవణం చేశారు. పలువురు పాల్గొని పంచాంగ శ్రవనం తరువాత వారి జాతకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో**

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు తెలుగు నూతన సంవత్సరాన్ని సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా దేవాలయాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఆలయాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించి శ్రీపరాభవ నామసంవత్సరం ద్వాదశ రాశి ఫలాలను వివరించారు. భక్తులకు షడ్రుచులతో మిలితం చేసిన ఉగాది పచ్చడిని తయారు చేసి పంచిపెట్టారు. ప్రజలు తమ ఇళ్లను, వ్యాపారులు దుకాణాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, కొండాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, ఘణాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం తదితర కాలనీల్లోని ఆలయాల్లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఉగాది ప్రత్యేకత్తైన తీపి బక్షాలను మహిళలు తయారు చేసి అందరికి అందజేశారు. ఘణాపూర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో వ్యవస్థాపక చైర్మన్-మాజీ సర్పంచ్ వేముల మమత మహేశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేసి పంచాంగ శ్రవణంలో పాల్గొనగా అర్చకులు దేవనూరి రాజేశ్వర్‌శర్మ ద్వాదశరాశిఫలాలను చదివి వినిపించారు. మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, వేముల సంజీవగౌడ్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, బోనకూర్తి అర్జున్, వేముల పరమేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు

ఘట్‌కేసర్ ఘణాపూర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం

వేముల శంకర్‌గౌడ్, చిలుగూరి భాస్కర్, మండల కృష్ణగౌడ్, నానావత్ సురేశ్‌నాయక్, కాంగ్రెస్ అధ్యక్షులు వేముల రాజుగౌడ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులఉ తాటికొండ మల్లేశగౌడ్, నాయకులు వేముల భాస్కర్‌గౌడ్, వేముల మహేశ్వర్‌గౌడ్, వడ్డ్యా రాజునాయక్, వేముల పరమేశగౌడ్, వేముల కేశవనాధంగౌడ్, డొంకెన బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సోషలీమీడియా ద్వారా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అర్చకుల వద్ద పలువురు నూతన సంవత్సర పంచాంగాలను కొనుగోలు చేశారు. ఉగాది సందర్భంగా ఘట్‌కేసర్ పట్టణంలో పండగ సామాగ్రి కొనుగోళ్లతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. మట్టి కుండలు, పూలు, పండ్లు, మామిడికాయలు, బెల్లం, కొబ్బరికాయలు తదితర పూజా వస్తువుల విక్రయాలు జరిగాయి.

## ఆధ్యాత్మికతతో క్రమ-శిక్షణ జీవనం

**కుల్కచర్ల, మార్చి 17, ప్రభాతవార్త :** ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని ఆర్బిఒఎల్ సిఈఒ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పాంబండ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక విధానం క్రమశిక్షణతో, నిజాయితీగా జీవించే అలవాటును నేర్పిస్తుందన్నారు.

ప్రతి వ్యక్తి భక్తి ఆ భావాన్ని అలవరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిఈఒ బాల నర్సయ్య, ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, అర్చకులు పాండు శర్మ మాజి ఎంపిటిసి రాంలాల్ నాయక్, పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, జి. రమేష్, ముజాహిత్‌పూర్ ఆనంద్, శంకర్,నరసంహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మకు క్షీరాభిషేకం

**కడ్తాల్, మార్చి 19, ప్రభతవార్త :** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు చైర్మన్ లక్షి ్మ శిరోలి పంతు నాయక్, ఈఒ స్నేహలత, టీ పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, మాదారం శ్రీరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సాంప్రదాయం ఉట్టిపడేలా ఉగాది పండుగ

కొత్త సంవత్సర పంచాంగ శ్రవణంలో పాల్గొన్న హిందువులు

**మోమిన్‌పేట్, మార్చి 19, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో హిందూ సాంప్రదాయం ఉట్టిపడేలా ప్రతి పల్లెలో గురువారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను పురస్కరించుకొని ప్రతి ఇంట్లో, ఆలయాలలో భక్తిశద్ధలతో శ్రద్రుచుల పచ్చడిని తయారు చేసి నూతన వస్త్రాలు ధరించి సాయంత్రం ఆయా గ్రామాల హనుమాన్ మందిరాలలో వేద బ్రాహ్మణులచే పంచాంగ శ్రవణం ఆలకించారు. ఈ సంవత్సరం వర్షాలు, పండే పంటలు, పన్నెండు రాశుల వారి వారి ఆదాయ, వ్యయ, రాజ్యపూజ్యము, అవమానం తదితర విషయాల గురించి పండితులు చెప్పే పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కలుసుకొని ఒకరికొకరు శ్రద్రుచుల పచ్చడిని సేవించి, తెలుగు పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

## ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**అడ్డగుట్ట, మార్చి 19 ప్రభాతవార్త:** తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా గురువారం పలువురు తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసానికి మర్యాదపూర్వకంగా వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసిన అందరికీ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపి ప్రతి ఒక్కరూ ఈ నూతన సంవత్సరంలో ఆనందం, ఆరోగ్యంతోపాటు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ శ్రీగణేష్ దేవాలయం చైర్మన్ పి.ప్రభాకర్‌యాదవ్, ధర్మకర్తలు వి.నరేష్, మల్లేష్, వేణుగోపాల్ చారి, సీనియర్ కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన పలువురు నాయకులు

**సంజీవరెడ్డి నగర్, మార్చి 19, ప్రభాతవార్త:** శ్రీపరాభవ నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షి ంచారు. గురువారం ఉగాది పర్వదినం సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఎమ్మెల్యేను సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసిన వారికి ఎమ్మెల్యే ఉగాది శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బేగంపేట, అమీర్‌పేట డివిజన్‌ల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, హన్మంత రావు, నాయకులు శ్రీహరి, నాగులు, అశోక్‌యాదవ్, నామన సంతోష్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, శేఖర్, పీయూష్‌గుప్తా, తదితరులు ఉన్నారు.

### తాగునీటి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన తలసాని...

**సంజీవరెడ్డినగర్, మార్చి 19, ప్రభాతవార్త:** ఆకలితో ఉన్నవారికి ఉచితంగా భోజనం అందించడం ఒక గొప్ప కార్యక్రమం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్‌లోని మోడల్ కాలనీ కమాన్ వద్ద మానవ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిత ఆహారం పంపిణీ, తాగునీటి పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు ఎమ్మెల్యే భోజనం, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బుచ్చిబాబు, సభ్యులు మాచారావు, సాయి, చావా శ్రీనివాస్‌రావు, శశికాంత్, రవిబాబు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పీయూష్ గుప్తా, ఖలీల్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేసిన డా. కోట నీలిమ

**సంజీవరెడ్డినగర్, మార్చి 19, ప్రభాతవార్త:** శ్రీపరభావ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అమీర్‌పేట్‌లోని ఏపీఏ సినిమాస్‌వద్ద, పరిసర ప్రాంతాల్లో డా. కోట నీలిమ మార్గనిర్దేశంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు రవికిరణ్ దేవులపల్లి, శ్రీకాంత్‌యాదవ్, ప్రమోద్, రవికాంత్ ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఇటువంటి సాంప్రదాయ కార్యక్రమం ఇటీవల కాలంలో జరగలేదని ప్రజలు అభినందనలు తెలిపారు. డా. కోట నీలిమ పాల్గొని, ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీచేసి మాట్లాడారు.

## ప్రజలకు శుభాలు చేకూరాలి : కోట నీలిమ

**బేగంపేట, మార్చి 19, ప్రభాతవార్త :** పండుగలు ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను సజీవంగా నిలుపుతాయని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజక వర్గం ఇంచార్జి కోట నీలిమ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం, హనుమాన్ దేవాలయాలవద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు త్రికాల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీపరాభవ నామ ఉగాది పండుగను పురస్కరించుకొని ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేసారు. కార్యక్రమానికి హాజరైన కోట నీలిమ మాట్లాడుతూ ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహంకాళి సీఐ రవికిరణ్, త్రికాల మనోజ్‌కుమార్, వినయ్, రాజ్ కుమార్, అఖిల్,ప్రసాద్, హేమంత్‌సింగ్‌ఠాకూర్, సురేష్, డాక్టర్ శివలాల్, కొండలు,నారాయణ, పాండు, రఘుయాదవ్, జగదీష్, మహేష్ పాల్గొన్నారు.

## సుందరయ్య పార్కులో వైభవంగా ఉగాది వేడుకలు

**చిక్కడపల్లి, మార్చి 19(ప్రభాతవార్త):** పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాదివేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం, ప్రత్యేకపూజలో వాకర్స్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ చేశారు. ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, ఏపీపీ మురళీకృష్ణ, మాజీ ఏపీపీలు దామోదర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, శైలజ మోహన్, వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్‌నాయక్, డైరెక్టర్ కిషన్‌రావు, సెక్రటరీ దశరథ్, మాజీ అధ్యక్షులు పి.వి.నిరంజన్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, వివేక్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 23న గరికపాటి ప్రవచనం, గ్రంథావిష్కరణ

**చిక్కడపల్లి, మార్చి 19 (ప్రభాతవార్త) :** ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ మద్దాళి సుబ్బారావు శతజయంతి సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత, సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావుచే ఆధ్యాత్మిక ప్రసంగం 23న ఉంటుందని కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వివరించారు. చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో ఆ రోజు సాయంత్రం జరిగే కార్యక్రమంలో నరసింహారావు రమణమహర్షి అంశంపై ప్రత్యేక ప్రవచనం చేయనున్నారు. అనంతరం మద్దాళి సుబ్బారావు రచించిన గ్రేషియస్ మూమెంట్స్ ఇన్ ద ప్రెజెన్స్ ఆఫ్ భగవాన్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టరు కె.వి.రమణాచారి, విశిష్ట అతిథిగా ఆదాయపు పన్ను శాఖ పూర్వ చీఫ్ కమిషనర్ రాయసం వెంకట్రామయ్య హాజరుకానున్నారు. ప్రముఖ సాహిత్యవేత్త డాక్టరు వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించనున్న ఈ సభలో ఆచార్య ముదిగొండ శివప్రసాద్, ప్రముఖ రచయిత శ్రీ వి. హర్షవర్ధన్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు డాక్టరు ఆర్. ప్రభాకరరావు, మద్దాళి రఘురామ్ వివరించారు.

# టిటిడి శ్రీవారి దేవాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

టిటిడి శ్రీవారి దేవాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న ఆంజేయశర్మ

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రీపరాభవ నామ సంవత్సరం ఉగాది పండువ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఉగాది అస్థానంతోపాటు స్వామి వారికి అన్ని పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉగాదిని పురస్కరించుకుని టిటిడి దేవాలయాన్ని పూలమాలలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించింది. సాయంత్రం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టిటిడి పంచాంగ శ్రవణం భాస్కర భట్ల ఆంజేయశర్మ చేశారు. ఆయన పంచాంగ శ్రవణం చేస్తూ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు తెలుసుకోవడమే పంచంగాం అర్థమన్నారు. శ్రీవారిని భక్తితో సేవిస్తే అన్ని శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆయా రాశుల వారికి ఈ సంవత్సరంలో కలిగే ఫలాలను తెలియజేశారు. అనంతరం ఆయన్ని దేవాలయం అర్చకులు ఘనంగా సత్కరించారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాల వితరణతోపాటు అన్నదానం జరిగింది.

ఉగాది సందర్భం గా టిటిడి ముద్రించిన పంచాగాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయం జరిగింది. టిటిడి ప్రత్యేక అధి కారి యు.రమేష్, అధికారి శ్రీనివాస్ మణికంత, శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

### లక్ష్మీగణపతి దేవాలయంలో...

**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆశ్రిత హోం బాలికలు

## పాతబస్తీలో వైభవంగా ఉగాది వేడుకులు

**చార్మినార్, మార్చి 19 ప్రభాతవార్త :** ఉగాది పండుగను ప్రజలు గురువారం భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ప్రజలు ఉగాది పండుగ సందర్భంగా ఇళ్లను అందంగా తీర్చిదిద్దారు. కొత్త బట్టలు ధరించి సమీపంలో ఉన్న దేవాలయాలలో పూజలు నిర్వహించారు. తెలుగు ప్రజలకు ఉగాది తొలి పండుగ కావటంతో ఎంతో ఆనందోత్సాహాల మధ్య శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మామిడి తోరణాలతో ద్వారాలను అందంగా అలంకరించారు.పాతబస్తీ దూద్‌బౌలిలోని ఆశ్రిత హోంలో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు.చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో వైభవంగా ఉగాది మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. దూద్‌బౌలి, కిషన్‌బాగ్, మీరాలంమండి, పురానాపూల్‌తో పాటు పలు ప్రాంతాలలోని దేవాలయాలలో గురువారం సాయంత్రం శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది.కొత్త సంవత్సరం సందర్భంగా తయారు చేసిన ఉగాది పండుగను ప్రజలు ఎంతో ప్రీతితో ఆరగించారు.

### ఎంపి, ఎమ్మెల్యే కాలనీలో...

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి, చిత్రంలో రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్‌లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.క్లబ్ అధ్యక్షుడు ఇనుగాల పెద్దిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉగాది పంచాంగ శ్రవణం అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరంపర కళాకారులు ప్రదర్శించిన మహాకాళి నృత్యం ఆద్యంతం కట్టి పడేసింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త శిల్పా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా సంప్రదాయ పిండివంటలతో విందును ముగించారు.

## ఏసిపి రమేష్‌కుమార్‌కు సన్మానం

**చిక్కడపల్లి, మార్చి 19(ప్రభాతవార్త):** చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్‌ను ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎకె గిడియన్ బాబు గురువారం ఘనంగా సత్కరించారు. ఏసిపి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను, విధి నిర్వహణను వారు విశేషంగా ప్రశంసించారు. విధుల్లో ప్రదర్శిస్తున్న క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం అభినందనీయమని గిడియన్ బాబు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూనే, ప్రజల సమస్యలను సహానుభూతితో విని తక్షణ పరిష్కారం చూపడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ముఖ్యంగా యువతలో చట్టం పట్ల అవగాహన కల్పించడం, ప్రజలకు చేరువయ్యే ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తూ, పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతున్న ఇలాంటి అధికారులు సమాజానికి గర్వకారణమని నాయకులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ డాక్టర్ శామ్యూల్ జాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రేవ. శాంతి కుమార్ గిల్లా, బుడిగే కలేబు తదితరులు పాల్గొన్నారు.

ఏసిపి రమేష్ కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఎ.కె.గిడియన్‌బాబు

పంచాంగశ్రవణం చేస్తున్న వేదపండితులు బుగ్గాలక్ష్మీపతిశర్మ తదితరులు

## ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం

**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, ముఖ్యఅర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాచీనమైనది ఆయుర్వేదం వైద్యం : ఎమ్మెల్యే

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త :** ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాచీనమైనదని, విశ్వసించదగినదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేల వల్లాల నవీన్‌యాదవ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రినయ ఆర్య వైద్యశాలను ఆయన గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేదం మన పురాతన, సంప్రదాయ వైద్యశాస్త్రం అన్నారు. సేవా దృక్పథంతో ఏర్పాటుచేసిన ఈ ఆర్య వైద్యశాల వల్ల వేలాదిమంది ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారని అన్నారు. ఆయుర్వేద వైద్యాన్ని పొందేందుకు వేరే రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా హైదరాబాద్‌లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కొటక్కల్ ఆయుర్వేద ఆర్య వైద్యశాల మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి మాధవన్ కుట్టి వారియర్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా దేశంలో 20 లక్షల మందికి పైగా ఆయుర్వేద వైద్యాన్ని వినియోగిస్తున్నారన్నారు. ఇది నమ్మదగిన వైద్యమని అన్నారు. కార్యక్రమంలో కోటక్కల్ ఆర్య వైద్యశాల సీఈవో హరి కుమార్, జోగేష్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ కానుకల పంపిణీ

**ఖైరతాబాద్, మార్చి 19(ప్రభాతవార్త):**రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందజేస్తున్న రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం ఖైరతాబాద్ నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ డివిజన్‌లోని కుతుబ్ షాహి మస్జిద్ (బడి మస్జిద్) వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి పేద ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ కానుకలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. రంజాన్ మాసం సొభ్రాతృత్వం, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్ పండుగకు మసీదుల ముస్తాబు

**ఖైరతాబాద్, మార్చి 19(ప్రభాతవార్త):** రంజాన్ పండుగను పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లోని మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ నెల సందర్భంగా మసీదులను శుభ్రపరిచి, రంగురంగుల లైట్లతో అలంకరించారు. ప్రార్థనలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నమాజ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా భక్తి, సొభ్రాతృత్వ వాతావరణం నెలకొంది.

## అనాథాశ్రమంలో ఉగాది వేడుకలు

అనాథ ఆశ్రమంలో చిన్నారులకు పోల్లేలు అందచేసిన శంకర్‌యాదవ్

**బేగంబజార్, మార్చి 19 ప్రభాతవార్త:** స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, సంఘ సేవకులు ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని మాజీ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ పిలుపు నిచ్చారు.ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా ఉస్మాన్‌గంజ్‌లో భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథాశ్రమంలో ఉన్న చిన్నారుల మధ్య ప్రతియేటా మాదిరి గానే ఈఏడు ఉగాది పండుగను జరుపుకున్నారు. అల్పహారం తోపాటు పోల్లేలు, పులిహోరా, తదితర అల్పహారాన్ని అందచేశారు. కార్యక్రమంలో బిజెపి యువనాయకులు జి.తరుణ్‌యాదవ్ జెల్లా శ్యామ్ యాదవ్, సుధీర్ సింగ్, మహేష్ కాకా, జి.అశోక్‌యాదవ్, బండ క్రాంతి కుమార్, అర్జున్‌యాదవ్, దుర్గాయాదవ్, శిరీషయాదవ్, అరుణ్‌కుమార్ సింగ్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆలయంలో భక్ష్యాల పంపిణీ

**కంటోన్మెంట్, మార్చి 19 ప్రభాతవార్త:** పరాభవ నామ సంవత్సరంలో అందరికి విజయం, ఆనందం అష్టైశ్వర్యాలు కలిగి సుఖశాంతులతో జీవించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ఆకాంక్షించారు. ఉగాది పండుగ సందర్భంగా న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయంలో దాత చలపతి, శ్రీదేవి ముత్యాలమ్మ ఆలయంలో దాత మధుగౌడ్ ఆధ్వర్యంలో భక్ష్యాల(పోలేలు) పంపిణి కార్యక్రమంలో జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై పంపిణీ చేసారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ దుర్గయ్య,కొమరయ్య, నగేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, నర్సింగ్‌రావు, మల్లేష్, పరశురాం, నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు అజిత్కళ్యాణ్, ప్రేమ్‌ముదిరాజ్, నర్సింహ, రామరావు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో అయ్యప్ప అన్నప్రసాద వితరణ

**చిక్కడపల్లి, మార్చి, 19 (ప్రభాతవార్త) :** అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, అన్నదానాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి నెల అమావాస్య రోజున క్రమం తప్పకుండా అయ్యప్ప స్వామి వారి ప్రసాదం పేరుతో వందలాది మంది పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమితి నిర్వాహకులు సోమిశెట్టి శ్రీనివాస్‌కు, సభ్యులకు అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, జ్ఞానేశ్వర్, సాయి గౌడ్, శ్రీనివాస్ గుప్తా, అలాగే కమిటీ సభ్యులు అమర్నాథ్, వీరేష్, అనిల్ కుమార్, శ్రీధర్, మోతే చంద్రశేఖర్, పబ్బా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది వేడుకలు

**ఖైరతాబాద్, మార్చి 19 (ప్రభాతవార్త):** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని సంప్రదాయ పద్ధతిలో తయారు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉగాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని పంపిణీ చేసి, కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

ఉగాది పచ్చడిని చేస్తున్న విజయరెడ్డి

## వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అవసరం

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 19, ప్రభాతవార్త**

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఇలగల సుధీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూసాపేట్ జనతా నగర్‌లోని శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ ఆలయం వద్ద ప్రజల సౌలభ్యం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చిన యువ నాయకులు ఉప్పల చంద్రశేఖర్ గుప్త, ఇలగల సాయిప్రసాద్‌లను వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని, ఇది నిజమైన సామాజిక సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షి స్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరు ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
I.A.NO. 334 OF 2022
and
I.A.NO. 585 OF 2022
IN
OP.NO. 3076 OF 2016

Between:
**Boorugu Ramesh Babu** ...Petitioner
AND
**Boorugu Mahabaleshwar and others ...Respondent/proposed Respondents**

To,
1. **Boorugu Dinesh Kumar,** S/o Late BooruguMurlidhar Rao, Aged 48 years.
2. **Boorugu Ranjani Laxmi Malayala Srinivan,** D/o Late BooruguMurlidhar Rao, Aged 42 years.
(Both are R/o 1-108/A, Booeugu Vihar, Begumpet, Secunderabad – 500016)
3. **Boorugu Suvarnamala,** W/o Late Mahabaleshwar Rao, Aged 73 years, Occ: Housewife, R/o 1-10-8/C Begumpet, Hyderabad 500016
4. **Smt. Vuppalanchi Geethabharathi,** W/o V. Manoj, D/o Mahabaleshwar Rao Aged 55 years. R/o Plot No. 161old Vasavi Nagar, Karkhana, Secunderabad 500015.
5. **Smt. Jupudi Swarnakala,** W/o J Sudhakar, D/o Late Mahabaleswar Rao, Aged 53 years, R/o Jyothi Colony Rd no 47, Karkhana, Srinikitha Apartments, AOC Gate, Picket, Kakaguda, Secunderabad 500015
6. **Sri Boorugu Ramakarishna,** S/o Late Mahabaleshwar Rao Aged 53years, Occ: Business, R/o 1-10-8/C Begumpet, Hyderabad
7. **Sri Boorugu Ravikanth,** S/o Late Mahabalesawar Rao Aged 50years, Occ: Business, R/o. 1-10-8/C Begumpet, Hyderabad 500016

The Petitioner Mr.Boorugu Ramesh Babu has filed I.A. No.334/2022 & I.A.No. 585 of 2022 in OP No.3076 of 2016 on the file of Hon'ble IX Additional Chief Judge, City Civil Court, Hyderabad under Order 22 Rule 4 of CPC to bring you on record as the legal representatives of deceased Respondent No.10 & 1 in OP.No.3076 of 2016. The said applications are posted on **01.04.2026** for your appearance. You are therefore required to appear in person or through a duly appointed Advocate before the Hon'ble IX Additional Chief Judge, City Civil Court, Hyderabad on **01.04.2026 at 10:30 am** failing which the Hon'ble Court shall proceed to decide the matter based on the material available on Record.

// ISSUED UNDER ORDER OF THE COURT//

**M. Narsimha Reddy**
**Advocate**
**M/s Ganu & Co., Advocates**
#201-202, 3-5-874/A,
Vipanchi Estate Hyderguda,
Hyderabad 500 029


# 27వ తేదీన సీతారాంబాగ్ రామాలయం నుంచి శ్రీరామ శోభయాత్ర

మాట్లాడుతున్న భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ కమిటి ప్రతినిధులు

**గోషామహల్, మార్చి 19 ప్రభాతవార్త:** శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తి శ్రద్దల మధ్య జరుపుకోవాలని భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఉత్సవ కమిటి చైర్మన్ డాక్టర్ భగవంత్ రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠిలు పిలుపు నిచ్చారు. ఈ మేరకు బహెతీభవన్‌లో ఏర్పాటు కార్యక్రమంలో ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. గురువారం ఉగాది పండుగను పురస్కరించుకుని ముందుగా గణపతి పూజ ప్రారం భించి గోపూజ చేశారు. అధ్యక్షులు డాక్టర్ భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్ రాఠి మాట్లా డుతూ 2010 సంవత్సరం నుంచి భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరాముని శోభయాత్రను నిర్వహించడం జరుగు తుందన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతోపాటు పోలీసు యంత్రాంగం సహకారం అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మాన్ని కాపాడేందుకు శోభయాత్రలు అవసమన్నారు. కలసికట్టుగా ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి. ఉమామహేంద్ర, కరోడిమల్ నర్సింగ్‌పూరియా, శ్రీరామ్ వ్యాస్, నటరాజ్ నామ్‌దారి, బిఆర్ఎస్ మహిళా నాయకురాలు శాంతిదేవి, బిజెపి మహిళా నాయకురాలు అరుణజ్యోతి, మాజీ ఎస్సీ కమి షన్ సభ్యులు కె.రాములు, మాజీ కార్పొరేటర్లు వై. కృష్ణ, వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ప్రేమ్ కుమార్ అగర్వాల్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.


IN THE COURT OF HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT MEDCHAL
O.S. No. 134 of 2026

BETWEEN:
1. **Gowrla Mallamma** W/o Late Gowrla Jeetaiah @ Jeethaiah, Aged: 56 years, Occ– House Wife, R/o 9-296, Gandhi Road, Medchal Village and Mandal, Medchal-Malkajgiri District
2. **Banda Padma** W/o Kumar D/o Late Gowrla Jeetaiah @ Jeethaiah, Aged: 35 years, Occ– House Wife, R/o H.No. 2-52, 4th Ward, Gomaram Shivampet Mandal, Medak District
3. **Gowrla Mahesh** S/o Late Gowrla Jeetaiah @Jeethaiah, Aged 33 years, Occ– Pvt Job,
4. **Gourla Bharath Kumar** S/o Late Gowrla Jeetaiah @Jeethaiah, Aged: 31 years, Occ– Pvt Job, Both R/o 9-296, Gandhi Road, Medchal Village and Mandal, Medchal-Malkajgiri District ...**Plaintiffs**

AND

1. **The Tahsildar,** Medchal Mandal Medchal-Malkajgiri District
2. **All Concerned** ...**Defendants**

To,
**All Concerned,**

Take notice that the Plaintiff, Gowrla Mallamma W/o Late Gowrla Jeetaiah @ Jeethaiah filed a suit to declare them as legal heir of late Gowrla Jeetaiah@Jeethaiah before I Addl. Junior Civil Judge-cum-VIII Addl Judicial Magistrate of First Class at Medchal, and the Honorable court was pleased to order notice to all concerned by way of publication, and the above case stands posted to **13-04-2026 at 10-30 AM;** as such, any person/persons who have any interest or claim may appear either personally or through an advocate on said date and time; failing which, the matter will be decided basing on the record as per law by the Hon'ble court.
Given under the hand and seal of this Court the 18th day of February, 2026.

(By order of the Court)

**Sd/- P. KIRAN**
**G VENKATESH**
**ADVOCATES**
Office at 3-145/4, Opp: Cricket Ground, Singaipally (V), Hakimpet, Shamirpet Mandal, Medchal-Malkajgiri District, Telangana-500078



IN THE COURT OF IX ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD:
I. A. No: 435 & 436 & 437 OF 2024.
IN
I. A. No: 1280 OF 2018.
IN
O. S. No: 371 OF 2009.

Between:-
**C. SRINIVASA CHARY (Died per I.Rs), Chakravarthi Bhavani & Others**
**... PROPOSED PETITIONERS/ PETITONERS/PLAINTIFFS.**
AND
**V. CHANDRA MOULI. & OTHERS, ...RESPONDENTS/RESPONDNETS DEFENDANTS.**

To,
**1). V. CHANDRA MOULI.,** S/o: V. Vasudev, Age: 52 years, Occ: Business, R/o: H.No: 16-2-701/9/3, Anandnagar, Malakpet, Hyderabad

Take notice that the Proposed Petitioners/ Petitioners / Plaintiffs Herrin filed the above I.A. No: 435/2024 & 436/2024 & 437/2024 in I.A. No: 1280/2018 in O.S. No. 371/2009 Against No: 1 of You (V. CHANDRA MOULI) i.e. Respondent / Defendant No:1. On the file of IX ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT: HYDERABD, 1) For condone the delay & 2) set side the abatement & 3) bring the proposed petitioners in the above suit The said I.As. stands posted to **26-03-2026,** for your appearance i.e. Respondent No.1 / Defendant No.1, before the Hon'ble Court. If you fail to appear either in Persons or through Advocate before this Hon'ble Court, on the said date of hearing i.e. **26-03-2026, at 10.30 A.M.,** at IX ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT: HYDERABAD the matter will be heard in your absence & exparte orders will be passed against you.

(BY ORDER OF THE COURT)

**Mr. SRINIVAS RAO MADIRAJ,**
**ADVOCATE.**

## వినాయక్ నగర్ మసీదులో ఇఫ్తార్ విందు

**నేరేడ్ మెట్, మార్చి 19,ప్రభాతవార్త:** రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని వినాయక్ నగర్ మసీదులో బుధవారం రాత్రి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం సౌహార్ద్ర వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, సేవా భావాలకు ప్రతీక అని అన్నారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసి సోదరభావంతో జీవించడం సమాజానికి అవసరమని తెలిపారు. ఇలాంటి ఇఫ్తార్ విందులు పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీ కే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎన్వీ సతీష్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ బాయ్, పిట్టల నాగరాజు, ఎస్ ఆర్ ప్రసాద్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, సంపత్ గౌడ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, సయ్యద్ మబ్బు, ఫరీద్, షకీల్, ఫరూక్, ఆశా, జాన్ బి, బాల్ రాజ్ యాదవ్, ఆగమయ్య, బాబు, సత్యనారాయణతో పాటు మసీదు కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి : పివిపి అంజనీ కుమారీ

పివి లక్ష్మిని సన్మానిస్తున్న పివిపి అంజనీ కుమారి తదితరులు.

**మలక్ పేట, మార్చి 19,ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని తెలంగాణ రాష్ట్ర సిపిస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజనీ కుమారీ పేర్కొన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని సాహితీ సేవా సంస్థ అధినేత్రి, గాయని పీవీ లక్ష్మి, కోఆర్డినేటర్ శ్రీనివాస్ రామ రాజు ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్, ఉగాది సంబరాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పివిపి అంజనీ కుమారీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పేర్కొన్నారు. ఉగాది పురస్కారాలు తీసుకుంటున్న పురస్కార గ్రహీతలను ఆమె అభినందించారు. నిర్వాహకురాలు పివి లక్ష్మి సంగీత, సాహిత్య, సామాజిక రంగాలలో విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నిర్వాహకులు పీవీ లక్ష్మి, శ్రీనివాస్ రామరాజు తదితరులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరిముల్లా, శారద, సుబ్బరామన్, నాగమణి, అంజయ్య గుప్తా, అరుణ్ రామ్, లక్ష్మీరత్నం, ఆనంద్, దేవేందర్ గౌడ్,స్వప్న,నరేష్ పాల్గొన్నారు.

## రంజాన్ మాసం శాంతికి చిహ్నం: హర్షలత

ఇఫ్తార్ విందులో పాల్గొన్న హర్షలత

**ఎల్.బి.నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినం శాంతికి చిహ్నం అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్లో తమలపాకుల హర్షలత ఆధ్వర్యంలో దవాత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షులు జల్‌పల్లి నరేందర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసంలో నిష్టతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి వెల్లివిరియాలన్నారు. ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందనీయమన్నారు. రంజాన్ సుఖసంతోషాలను అందించాలన్నారు. రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌యాదవ్, ఎన్టీఆర్‌నగర్ బస్తీవాసులు రాజునాయక్, ఎంఎం.మమ్మద్‌ఆలీ, అస్లాంలాలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సామెల్ ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: గంధమల్ల యాదగిరి

సమావేశంలో మాట్లాడుతున్న గంధమల్ల యాదగిరి

**ఎల్.బి.నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటీమీద దాడి చేసిన వారిని వెంటనే ఆరెస్టు చేయాలని బహుజన సంఘర్షణ సమితి (బీఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు గంధమల్ల యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలోని బీఎస్ఎస్ కార్యాలయంలో గురు వారం ఏర్పటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మె ల్యే మందుల సామెల్ సంస్కృత మంత్రాల పేరుతో జరుగుతున్న మోసాలను ప్రశ్నించడం, బ్రాహ్మణిక వాదాన్ని సవాలు చేయడం ఆయన రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును సహించలేని బీ జేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ గుంపులు దాడులకు దిగడం చూ స్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం ఎంత ప్రమాదంలో ఉందొ అర్థ మవుతోందన్నారు. దళిత ఎమ్మెల్యేను బహిరంగంగా ఆవమానిం చడం బిడ్డ అంటూ తక్కువ చేసి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడడం, ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం సిగ్గుచే టన్నారు. ఇది స్పష్టమైన మనువాద ఆహంకారమని, దళితులపై కొనసాగుతున్న సామాజిక దాడుల మరో రూపమన్నారు. దళిత బహుజనులపై వాడులు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ దాడికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ద్వేష ప్రసంగాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

# ఎల్బీనగర్‌లో వైట్ ఛాలెంజ్‌తో తీవ్ర ఉద్రిక్తత..

### బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం
### ఇరు వర్గాల వారిని అదుపులో తీసుకున్న పోలీసులు

**మన్సూరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఇటీవల మొయినాబాద్ లో జరిగిన డ్రగ్స్ పార్టీ వివాదం నేపథ్యంలో ఎల్బీ నగర్ఎం ఎల్ ఏ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తో కొందరి అనుచరులు ఆదివారం డ్రగ్స్ టెస్ట్ కు రావాలని ఎల్బీ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైట్ ఛాలెంజ్ పేరుతో సవాలు విసిరారు. ఇట్టి సవాలు ను స్వీకరించిన ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి తన అనుసరులతో కలిసి ఎల్బీ నగర్ లోని అంబేద్కర్ విగ్రహాల వద్దకు ఆదివారం మధ్యాహ్నం చేరుకున్నారు. అదే విధంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు సైతం అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి నినాదాలు చేస్తూ విగ్రహం వద్ద ఉన్నారు . ఇరు వర్గాలు పోటా పోటీగా నినాదాలు చేస్తూన్నా నేపథ్యం లో ఎల్బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య తో పాటు పోలీసులు భారీగా మోహరించి ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు . ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుని అక్కడి నుండి తరలించారు. అదే విధంగా ఎంఎల్ ఏ సుధీర్ రెడ్డి ని కూడా పోలీసులు నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని పోలీసులు తరలించి శాంతి భద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

**చిల్లర రాజకీయాలు మానుకోండి - అభివృద్ధి విషయంలో మాతో పోటీపడండి: దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ నాయకులు డ్రగ్ టెస్ట్ పేరిట వైట్ ఛాలెంజ్ ప్రకటించి, అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మా నాయకులతో వచ్చానని అయితే, కాంగ్రెస్ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇది వారి ద్వంద్వ వైఖరికి, చిల్లర రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. సవాళ్లు విసిరిన తర్వాత వాటికి సమాధానం చెప్పేందుకు వెనక్కి తగ్గడం కాంగ్రెస్ నాయకుల వైఫల్యాన్ని చూపుతోందని అన్నారు. ఎల్.బి.నగర్‌లో ఇంతవరకు లేని విధంగా ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తాము ఎప్పుడైనా, ఎక్కడైనా డ్రగ్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తమతో ఉన్న కార్యకర్తలపై పూర్తి విశ్వాసం ఉందని, వారికి ఎలాంటి దురలవాట్లు లేవని అన్నారు. డ్రగ్స్ సంస్కృతిని తమ పార్టీ ఎప్పటికీ ప్రోత్సహించదని తెలిపారు. అలాగే తమ నాయకుడు కేటీఆర్ పై చేసిన డ్రగ్స్ ఆరోపణలు కూడా నిరాధారమని, ఆయన కూడా ఎప్పుడైనా పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు స్పందించకుండా మోనం వహిస్తున్నారని విమర్శించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంఎల్ ఏ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల విఠల్ రెడ్డి, గజ్జెల మదుసూదన్ రెడ్డి, భవాని ప్రవీణ్, విశ్వేశ్వర్ రావు, జక్కిడి రఘువీర్ రెడ్డి సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**డ్రగ్స్ సిటీ గా మారుస్తున్న బీఆర్ఎస్: జక్కిడి**

హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీ గా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి ఎంతో పట్టుదలతో ఉన్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో బీఆర్ ఎస్ నాయకులు మాత్రం డ్రగ్స్ ను యదేచ్ఛగా తీసుకొంటూ పార్టీ లు చేసుకుంటున్నారని అందుకు నిదర్శనమే మొయినాబాద్ డ్రగ్స్ కేసు అని తెలిపారు. అందులో భాగంగా ఎల్బీ నగర్ లో కూడా డ్రగ్స్ ఫ్రీ అనే నిర్ణయంతో సవాలు విసరడం జరిగిందన్నారు. ప్రతి ప్రజా ప్రతినిధి డ్రగ్స్ టెస్ట్ చేయించుకొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి :ఎమ్మెల్యే అహ్మద్ బలాల

: సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల ,చిత్రంలో అసోసియేషన్ చైర్మన్ కనుకుల రవీందర్ రెడ్డి, ప్రెసిడెంట్ గుండెవరపు వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి రామారావు తదితరులు

**మలక్ పేట ,మార్చి 19, ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్లకి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీపురం కాలనీ కమ్యునిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో 75 వసంతాలు పూర్తి చేసుకున్న సీనియర్ సిటిజన్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఉగాది పర్వదినం నాడు సీనియర్ సిటిజన్లను సన్మానించడం అభినందనీయమని శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నిర్వాహకులను ఆయన అభినందించారు. శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం చైర్మన్ కనుకుల రవీందర్ రెడ్డి, అధ్యక్షులు గుండెవరపు వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు అహ్మద్ బాషా షేక్, ప్రధాన కార్యదర్శి జి.వి.రామారావులు మాట్లాడుతూ తమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 350 కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ శాస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్న కాలనీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వర రావు అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం స్పోర్ట్స్ కార్యదర్శి భవాని శంకర్, కార్యవర్గ సభ్యులు టీవీ శ్రీధర్, డాక్టర్ ఉమా మహేశ్వరరావు, పవన్ కుమార్,మనోభవి,కార్తీక్ పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు

చిలుకానగర్‌లో ఉగాది వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 19 ప్రభాతవార్త :** తెలుగు కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరు విజయాలను అందిపుచ్చుకోవాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదిజగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం చిల్కానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నూతన తెలుగు సంవత్సరంలో చిల్కానగర్ డివిజన్ మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, చలివేంద్రం ప్రజల వేసవి తాపాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అకిటి ఆగం రెడ్డి, కొంపల్లి బాలరాజు, అమరేశ్వరి, నల్లవెల్లి మహేందర్, గండికోట గణేష్, దుండగుల శంకర్, మామ శ్రీరాములు, అమర్, నారోజు రాధా కృష్ణ, కూరెల్లి యాదగిరి, కొంద్ర రాములు, రాంచర్ల బలరాం, పల్నాటి కృష్ణయ్య, జంగ్రిపోతుల చంద్రయ్య, మరపాక సాయిలు, పగిడం రామ్ నరసయ్య, పల్నాటి డేవిడ్, పల్నాటి రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడ రామాలయంలో పంచాంగ శ్రవణం

హబ్సిగూడ రామాలయంలో పంచాంగ శ్రవణాన్ని ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 19 ప్రభాతవార్త :** ఉగాది పర్వదినం సందర్భంగా హబ్సిగూడ రామాలయంలో మేడ్చల్ మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పంచాంగ శ్రవణాన్ని ఆవిష్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి తెలుగు ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మేలు జరుగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రంచాంగ శ్రవణం నిర్వహించారు. కొత్త ఏడాదిలో హబ్సిగూడ ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గన్నారం విజయ్ కుమార్, రామాలయం చైర్మన్ చింతల బాబూరావు, ఆలయ పూజారి గట్టు శ్రీనివాస చార్యులు, యూత్ అధ్యక్షుడు వాసు నాయక్, నేతలు సుమన్ నాయక్, సాయి కిరణ్, లక్ష్మినారాయణ, రవి పాల్గొన్నారు.

### ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ఉగాది వేడుకలు

**ఉప్పల్, మార్చి 19 ప్రభాతవార్త :** ఉప్పల్ శిల్పారామంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని గురువారం జాల సోమనాదఙ శపంచాంగ పఠనం ఏర్పాటు చేశారు. ఈ పరాభవనమా సంవత్సరంలో దేశ పరిస్థితి, నవనాయక ఫలములు, పుష్కరాలు, ద్వాదశ రాశుల సంవత్సర ఫలితములు గురించి వివరించారు. నాట్య గురువు అడపా భరణి గారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో వినాయక కౌతం, శివ కౌతం, పలుకే భానగరయ్యా, పరమపురుషుడు, అయిగిరినందిని, భో శంభో, సాధించే, శరణం భావ, శివ పంచాక్షరీ తదితర అంశాలను కళాకారులు నియతి, చక్రికా, జాన్వీ, మనస్విని, అనన్య, రామ హృదయ, శ్లోక, హర్షిత, మానస, సంయుక్త తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

## మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పార్టీ నేతల ఘన సత్కారం

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, మార్చి 19 ప్రభాతవార్త :** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ జన్మదినం సందర్భంగా పలువురు పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు రేవు నరసింహ, సంకూరి కుమారస్వామి, నారాయణదాసు, వేముల తిరుపతయ్య, నగేష్ తదితరులు శాలువాతో సత్కరించారు. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నాయకత్వంలో ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అదే విధంగా బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు తాళ్ల బాలకృష్ణగౌడ్, తదితరులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్ తదితరులు

రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసి బొకేను అందజేస్తున్న బిజెపి కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి

## ఉగాది పండుగ సందర్భంగా అన్నదానం

అన్నదానం చేస్తున్న శేషగిరిరావు, ప్రసాద్‌రావు, రమేష్‌లు

**సైదాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** ఉగాది పండుగ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మినగర్ కాలనీలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సర్వీసెస్ ట్రస్ట్ ట్రస్టీ ఎ.శేషగిరిరావు, ఈనాడు రమేష్, నేరెళ్ల ప్రసాద్‌రావు, కుమార్, ప్రియ, మహేందర్, అపర్ణ, అన్నపూర్ణ, సుబ్రమణ్యం, గోవిందరావు, నరేష్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన

పూజలు నిర్వహిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌లు

**సైదాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** పరాభవ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా గాంధీభవన్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు మరింత బలపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఏపిఏయు కాలనీలో ఘనంగా ఉగాది సంబరాలు

కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

**సైదాబాద్, మ్హా 19 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని గడ్డి అన్నారం ఏపిఏయు కాలనీలో గల ధర్మ నిలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాంగ శ్రవణం, కోలాటం, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కవి సమ్మేళనాన్ని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో, పంచాంగ శ్రవణాన్ని వేద పండితులు మోహన్‌రావు, కోలాటాన్ని స్వప్న బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

## బహుజన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి : ఇబ్రాం శేఖర్

ఇబ్రాం శేఖర్‌ను కలిసిన మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి నాయకులు

**సరూర్‌నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** బహుజన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని బిఎస్‌పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పార్టీ నాయకులకు సూచించారు. ఇటీవల బడంగ్‌పేట్‌లోని సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్స్‌లో కాన్షీరామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన బహుజన రాజ్యాధికార యుద్ధభేరి సభ విజయవంతం అయిన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి కేతావత్ బహుగుణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శేఖర్‌ను కలిసారు. ఈ మేరకు పార్టీ నాయకులను, కార్యకర్తలను అదే విధంగా సభ విజయవంతం చేయడానికి కృషి చేసిన వారందరినీ ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనులకు ఎక్కడ అన్యాయం జరిగినా బిఎస్‌పి నేతలు, కార్యకర్తలు స్పందించాలని అన్నారు. ప్రజల్లో పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు పల్లె కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొప్పుల సురేందర్, కోశాధికారి ఇంద్రపల్లి సంజీవ, 57వ డివిజన్ అధ్యక్షుడు నిఖిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృదేవోభవ అనాథాశ్రమంలో ఉగాది వేడుకలు

మాతృదేవోభవ ఆశ్రమంలో అభాగ్యుల కోసం ఉగాది పచ్చడిని తయారు చేస్తున్న గట్టు గిరి కుటుంబం

**సరూర్‌నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** మతిస్థిమితం లేని అభాగ్యులు, అనాథలను ఆదరిస్తున్న నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ ఆశ్రమంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరితో పాటు ఆయన కుటుంబ సభ్యులు మానసిక దివ్యాంగుల మధ్య పండుగ జరిపారు. ఈ మేరకు వారు ఉగాది పచ్చడిని తయారు చేసి అశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ ఉగాది పండుగ రోజున ఆశ్రమంలో ఉన్న వారందరు ఆనందంగా గడపాలనే వేడుకలు నిర్వహించామని తెలిపారు.

### ఓటీఎస్ పథకాన్ని ఆస్తిపన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి : జోనల్ కమీషనర్ చంద్రకళ

ఓటిఎస్ పథకాన్ని వినియోగించుకున్న ఆస్తిపన్ను బకాయిదారునికి రసీదు అందజేస్తున్న శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ: పక్కన బడంగ్‌పేట్ సర్కిల్ డిసి సరస్వతి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (ఓటిఎస్) పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీ భారాన్ని బకాయిదారులపై తగ్గించేందుకు ఉద్దేశించిన ఓటిఎస్ పథకానికి సంబంధించిన ప్రత్యేక కౌంటర్లను బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ఆరు డివిజన్లలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక డిప్యూటీ కమీషనర్ సరస్వతితో కలిసి ఆమె కౌంటర్లను ఆమె పరిశీలించి బకాయిలు చెల్లించిన వారికి రసీదులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీలోపు తమ ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించిన వారికి మాత్రమే వడ్డీపై 90 శాతం రాయితీ పథకం వర్తిస్తుందని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ప్రజలు ఓటిఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఎఎంసిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం మత పెద్దలకు దుస్తులు పంపిణీ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ముస్లిం సోదరులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 19 ప్రభాతవార్త :** రంజాన్ పండుగను ప్రజలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన నివాసంలో ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు, మోజంలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల కోసం బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రంజాన్ మాసం ప్రతి ఒక్కరికి శాంతి, సహనం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సఖ్యతతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద, మద్య తరగతి కుటుంబాలకు సహాయం చేయడం తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దీన్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఎం.డి. జహంగీర్, రహీం , కాలేరు జైనవీన్, మాస శేఖర్, రహమాన్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు

**ఎల్.బి.నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** తెలుగు నూతన ఉగాది పర్వదినం పరాభవ నామ సంవత్సరం వేడుకలు ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఎల్బీనగర్ ప్రాంతంలోని ప్రజలు సాంప్రదాయ బద్ధంగా పండుగ వేడుకలు జరుపుకున్నారు. తీపి, వగరు, చేదు, పులుపు, కారం, ఉప్పు షడ్రుచుల కలయికతో సాఫీగా సాగాలని కోరుకుంటూ ఉగాది పచ్చడి, పిండి వంటలను చేసుకున్నారు. సాయంత్రం దేవాలయాలలో పురోహితులు పంచాంగ శ్రవణ పఠనం కార్యక్రమాన్ని గావించారు. రాశుల ప్రకారం తెలుగు సంవత్సరంలో జరిగే వారి జాతకాన్ని గురించి పండితులు వివరించారు.

## ఆంజనేయ స్వామి ఆలయంలో ఉగాది ప్రత్యేక పూజలు

అల్మాస్‌గూడ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసిన భక్తులు

**సరూర్‌నగర్, మార్చి 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని అల్మాస్‌గూడలోనున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదిన ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, డైరెక్టర్ దిండు శ్రీనివాస్‌గౌడ్, రామిడి సుభాష్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉగాది పండుగ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బిజెపి సీనియర్ సిటిజన్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చందర్జీ కలసి శుభాకాంక్షలు తెలిపారు. (సైదాబాద్, ప్రభాతవార్త)